COMMUNIST PARTY OF INDIA (MARXIST)
ANDHRA PRADESH COMMITTEE
M.B.BHAVAN, 1-1-60/2,RTC X ROADS, HYDERABAD -20,
☎ 040-27665011, 27665012, Fax: 040- 27601001
E-mail: email@cpimap.org

**సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం- 2011 డిశంబర్25,26- హైదరాబాదు**

# ప్రజాసమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తున్న ప్రభుత్వం

రాష్ట్రంలో నెలకొన్న కరువు, విద్యుత్ తదితర ప్రజాసమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలని సిపిఐ(ఎం) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండు చేస్తున్నది.

రాష్ట్ర ముఖ్యమంత్రి, పాలకవర్గం పదవులు కాపాడుకోవడమే పరమావధిగా పనిచేస్తూ, ప్రజాసమస్యలను పరిష్కరించడంలో ఉద్దేశ్యపూర్వక నిర్లక్ష్యం వహిస్తున్నారు.

రాష్ట్రంలో 876 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రభుత్వం ప్రకటించింది. 52 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. ప్రభుత్వ అంచనాల ప్రకారమే రు.4500 కోట్ల విలువైన పంటలు నష్టపోయాయి. రుణగ్రస్తులైన రైతులు గత రెండు మాసాల్లోనే 250 మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఇప్పటి వరకు ఒక పైసాకూడా ప్రభుత్వ సహాయం అందలేదు. ప్రస్తుతం మార్కెట్లలో పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధరలు అమలు లేవు. క్వింటాలు రు.1110లకు అమ్మాల్సిన ధాన్యాన్ని రు.800-900 మధ్య వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. పత్తి, పసుపు, ధాన్యం పంటల ధరలు పూర్తిగా తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. కనీస మద్దతు ధరలకే కొనుగోలు చేస్తామని సివిల్ సప్లై శాఖా మంత్రి ఆర్భాటంగా చేసిన ప్రకటన కాగాతాలకే పరిమితమైంది. ప్రభుత్వ సంస్థలు కొనుగోలు చేయడం లేదు.

జలయజ్ఞం కాంట్రాక్టర్లు తమ డిమాండ్లు నెరవేర్చాలని లేదంటే పనులు నిలిపివేస్తామని ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు. ప్రాధాన్యతా ప్రాతిపదికన ప్రాజెక్టులను చేపట్టడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టమౌతున్నది.

ప్రజలందరికి వైద్య పౌకర్యం కల్పిస్తున్నామని ముఖ్యమంత్రి పదేపదే ప్రకటిస్తున్నాడు. ఆరోగ్యశ్రీని అందరికి అందుబాటులోకి తెస్తామన్న ప్రభుత్వం 104 వైద్య సిబ్బంది సమస్యలను పరిష్కరించడం లేదు. 1000 మంది ఉద్యోగులను తొలగించకూడదని, జివో.నెం.3ను అమలు చేయాలని గత 48 రోజులుగా ఆందోళనలు చేస్తున్నారు. కంప్యూటర్ టీచర్లు 12,500 మంది 100 రోజులుగా వేతనాలు సవరించాలని చేస్తున్న ఆందోళనను పరిష్కారం కాకుండా ఉంది.

మద్యాన్ని ఏరులుగా పారించి పాలక పార్టీ నాయకులు ముడుపులు స్వీకరిస్తున్నారని ఎసిబి దాడుల్లో వెల్లడైంది. ఆ వివరాలన్నింటిని బయటపెట్టాలని డిమాండ్ చేస్తున్నాం.

గిరిజనుల సంక్షేమ చర్యలు చేపట్టకపోగా వారి ఉనికికే ప్రమాదం తెచ్చే విధానాలను రాష్ట్ర ప్రభుత్వం కొనసాగిస్తున్నది. విశాఖ ఏజెన్సీ ఏరియాలో బాక్సైట్ త్రవ్వకాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజాఆందోళనను ప్రభుత్వం నిర్బంధంగా అణిచివేయ చూస్తున్నది. జిందాల్, ఆన్‌రాక్ కంపెనీలతో లోపాయికారి ఒప్పందాలు చేసుకుని గిరిజనుల ఉనికికి ప్రమాదం తెస్తున్నది. భూములు బలవంతంగా లాక్కొని ప్రకాశం జిల్లా మర్లపాడులో ఐరన్‌ఓర్ త్రవ్వకానికి కాంట్రాక్టర్లు పూనుకున్నారు.

ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా విద్యుత్తు ఉత్పత్తి కంపెనీలకు శ్రీకాకుళం, నెల్లూరు జిల్లాలలో సమస్యలు పరిష్కరించకుండా, ప్రజా ఆమోదం లేకుండా భూములను అప్పగిస్తున్నారు.

2011-12 సంవత్సరానికి దళితులకు సబ్‌ప్లాన్ కింద కేటాయించిన రు.7500 కోట్లలో నేటికీ రు.2400 కోట్లు మాత్రమే వ్యయం చేశారు. ఈ పద్దు కింద స్త్రీశిశు సంక్షేమానికి రు.33 కోట్లు కేటాయించగా కేవలం రు. 1కోటీ

67 లక్షలు మాత్రమే ఖర్చు చేశారు. సబ్‌ప్లాన్ నిధులను సక్రమంగా వినియోగించాలని జరుగుతున్న ఆందోళనలను ప్రభుత్వం పెడచెవిన పెడుతున్నది. ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను ఇప్పటి వరకు నియమించలేదు. రాష్ట్రంలో అటవీహక్కుల చట్టాన్ని అమలు నిలిపి వేశారు. 25లక్షల ఎకరాలను గిరిజనులకు పట్టాలిస్తామని చెప్పి 5.75లక్షల ఎకరాలకు మాత్రమే పట్టాలిచ్చారు. పట్టాలు పొందిన అనేక మందికి భూములు చూపించలేదు.

నిరంతరం మహిళాభివృద్ధి గురించి ప్రచారం చేస్తున్న ముఖ్యమంత్రి ప్రతి మహిళకు లక్ష రూపాయలు వడ్డీలేని రుణం ఇస్తామని చెప్పి కనీసం డ్వాక్రా గ్రూపులకు పావలా వడ్డీ రుణాలు ఇవ్వడం లేదు. చివరికి రాష్ట్ర మహిళా కమిషన్‌కు నియామకాలు లేవు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్ ఫీజ్ రియంబర్స్‌మెంట్ నిధులను ట్రెజరీల నుండి విడుదల చేయనందున ఫీజులు చెల్లించాలని కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నాయి.

ఇప్పటికే ఈ సంవత్సరం విద్యుత్‌చార్జీలు, ఆర్‌టిసి బస్‌చార్జీలు, వ్యాట్, ప్రాపర్టీటాక్స్, నీటిపన్నులు, ల్యాండ్ రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచి రు.10000 కోట్లకు పైగా భారాలు ప్రజలపై మోపింది. ఫ్యూయల్ సర్‌చార్జీలు, మద్యం మీద, వాహనాల మీద పన్నులు పెంచడానికి ప్రభుత్వం సిద్ధమవుతున్నది. ఇపుడు మరోసారి విద్యుత్తు చార్జీలు పెంచడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నది. డిస్కంలకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రు.12000 కోట్లు చెల్లించకపోవడం వలన ఆ సంస్థలు విద్యుత్తు చార్జీల పెంపునకు ఉపక్రమిస్తున్నాయి.

2012-13 సంవత్సరానికి బడ్జెట్టు తయారీకి కసరత్తు జరుగుతున్నది. బడ్జెట్టు సామాన్య ప్రజలకుపయోగపడే విధంగా రూపొందించడానికి వీలుగా అన్ని తరగతుల సంఘాలతో, రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశాలను నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నాం.

ప్రజలెదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సిపిఐ(ఎం) డిమాండు చేస్తున్నది.

--